ప్రజాశక్తి
బుధవారం 13 డిసెంబర్ 2023 5 అనంతపురం

అంగన్‌వాడీల 'సమ్మె'బాట..!

◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
◆ ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

శింగనమల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద బైటాయించి ఆందోళన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెకు పలు పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమ్మెతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

వార్త 6లో

అడగడమే అత్తెసరు..!

◆ మొన్న అంచనా రూ.251.20 కోట్లు
◆ కరువు బృందాన్ని అడిగింది రూ.158.63 కోట్లే...
◆ సమీక్షకు మీడియాకు అనుమతి నిరాకరణ
◆ పొద్దుగూకే వేళ పొలాల పరిశీలన

గుత్తి మండలంలో ఎండిన ఆముదం పంట పొలాలను పరిశీలిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
గుత్తి, కళ్యాణదుర్గం

అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదంటారు... అలాంటిది కరువు సాయం అడగటంలోనే లోపముంటే అందే సాయం ఎంతన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర కరువు బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటన నిమిత్తం మంగళవారం అనంతపురానికి చేరుకుంది. ఈ బృందం ముందు జిల్లా అధికార యంత్రాంగం పెట్టిన ప్రతిపాదనలు అత్తేసరుగా ఉన్నాయన్న చర్చ నడుస్తోంది. గణాంకాలు కూడా కరువును ప్రతిభించే విధంగా లేకపోవడంతో కరువు తీవ్రత తక్కువగానే ఉందనే అభిప్రాయంలో కేంద్ర ప్రతినిధి బృందంకు కనిపిస్తుండటం గమనార్హం.

కేంద్ర కరువు బృందం అనంతపురం జిల్లాలో మంగళవారం నాడు పర్యటించింది. భారత వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలోని కేంద్ర కరువు బృందం ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. మధ్యాహ్నం 1-30గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

అనంతరం అధికారులతో కరువుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలోనే ఉన్న కరువు బృందం అనంతరం భోజనం తరువాత సాయంత్రం నాలుగు గంటలకు మూడు బృందాలూ క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాయి. ఒక బృందం అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు, తలుపూరు గ్రామాల్లో కంది, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. రెండవ బృందం కళ్యాణదుర్గం, గుమ్మగట్ట మండలంలోని 75 వీరాపురం గ్రామాల్లో పర్యటించింది. మూడవ బృందం గుత్తి, పామిడి మండలాల్లో పర్యటించి పత్తి, ఆముదం, కంది పంటల పొలాలను పరిశీలించింది. పంటపొలాల పరిశీలన ప్రారంభమయ్యే సరికే నాలుగు గంటలు కావడంతో కొద్దిసేపటికే పొద్దుగూకే పరిస్థితి నెలకొనడంతో పర్యటన హడావుడిగా సాగింది. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడి కరువు పరిస్థితులను తెలుసుకున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు, దిగుబడి, రాబోయే రోజులకు అవసరమైన పశుగ్రాసం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు చాలా తక్కువగా పడటంతో ఈ ఏడాది పంట పూర్తిగా దెబ్బతినిందని అన్ని ప్రాంతాల్లోనూ రైతులు కరువు బృందం ఎదుట ఏకరువు పెట్టారు.

అడగడమే అత్తెసరు..!

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంటనష్టం అంచనాలను రూపొందించింది. దీని ప్రకారం అనంతపురం జిల్లాలో జరిగిన పంటనష్టానికి సంబంధించి రూ.251.20 కోట్లు నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇప్పుడొచ్చిన కరువు బృందం ముందు మాత్రం వ్యవసాయానికి సంబంధించి ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు ప్రతిపాదించినది రూ.158.63 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఇక ఉద్యానవన పంటలకు సంబంధించి కేవలం మిర్చి పంటకు మాత్రమే రూ.43.17 కోట్లు ప్రతిపాదించారు. మొత్తంగా వ్యవసాయానికి రూ.201.80 కోట్లు ప్రతిపాదించారు. పశు సంవర్ధక శాఖకు రూ.1.74 కోట్లు గ్రామీణ నీటి సరఫరాకు రూ.7.04 కోట్లు, పట్టణ తాగునీటి సరఫరాకు రూ.2.72 కోట్లు, ఉపాధి హామీకి రూ.116.52 కోట్లు కలిపి మొత్తం రూ.329.82 కోట్లు ప్రతిపాదించారు. ఉపాధి హామీ పథకంలో వేతనాలకు రూ.69.90 కోట్లుకాగా, మెటీరీయిల్ కంపోనెంట్‌కు రూ.46.62 కోట్లు ప్రతిపాదించారు.

మీడియాకు దూరంగానే..!

కేంద్ర కరువు బృందం పర్యటన మొత్తం మీడియాకు దూరంగా సాగింది. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం జరిగిన సమీక్షకు అనుమతించలేదు. సమీక్ష అనంతరం కేంద్ర కరువు బృందం టీమ్ లీడరు పంకజ్ యాదవ్ మీడియాకు సమాచారాన్ని బ్రీఫ్ చేశారు. అనంతరం పర్యటన సమయంలోనూ వెంట మీడియాను తీసుకెళ్లలేదు. బృందం సభ్యులు ఎక్కడికి వెళ్తున్నారన్న విషయాలపైనా కూడా మీడియాకు సరైన స్పష్టత ఇవ్వకుండానే పర్యటన సాగింది.

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను ఫొటోల ద్వారా కేంద్ర కరువు బృందానికి వివరిస్తున్న కలెక్టర్

కరువు దృష్ట్యా పంటలు ఎండిపోయిన దుస్థితిని కరువు బృందం సభ్యులకు వివరిస్తున్న మహిళా రైతు

కరువు బృందానికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కరువు జిల్లాను ఆదుకోవాలి : సిపిఎం

జిల్లాలో వర్షాభావంతో కరువు నెలకొన్న తరుణంలో జిల్లా ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కేంద్ర కరువు బృందాన్ని కోరింది. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో కరువు ఏర్పడిన నేపథ్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రోజుకూలి రూ.600 ఇవ్వాలన్నారు. పట్టణాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఈ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాకపోవడంతో జిల్లాలోని సుమారు 5 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయలేదన్నారు. ఈ రైతులందరూ కరువు వల్ల నష్టపోయారని తెలిపారు. కౌలు సాగుదారులు పంటనష్టంతో పాటు కౌలు నష్టపోయారని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు, పాడిరైతులు వర్షాభావం వల్ల తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇలా కరువు వల్ల నష్టపోయిన వీరందరూ సంవత్సరం రోజులు జీవించడానికి సరిపడా పరిహారం చెల్లించడం నిజమైన కరువు పరిహారంగా భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు రూ.10వేల కోట్లు కరువు ప్యాకేజీని ప్రకటించి రైతుల అప్పులు మాఫీ చేయాలన్నారు. పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. పట్టణాల్లో జాతీయ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. కౌలురైతులకు కౌలు రద్దు చేసి పంట నష్టపరిహారం వాస్తవ సాగుదార్లు అయిన కౌలు రైతులకు చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందార్లకు కరువు ఫైనాన్స్ ఇవ్వాలన్నారు. పాడి రైతులకు లీటర్‌కు రూ.10లు కరువు బోనస్ చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ బియ్యం, కందిపప్పు, గోధుమలు, చక్కెర, మంచినూనె, వంటి 14 రకాల నిత్యావసర సరుకులు చౌకడిపో ద్వారా అందించాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మన్నీల రామాంజనేయులు, వై.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై

ఆకతాయిల వేధింపులు..?

ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితి..

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజులుగా విద్యార్థినులను ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థినులు పాఠశాలలో ఉన్న సమయంలో ఆకతాయిలు అక్కడికి వచ్చి, అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం పాఠశాల ఆవరణలోకి వచ్చిన యువకులు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో భయాందోళనకు గురైన పిల్లలు తల్లిదండ్రులకు తెలిపారు. ఆకతాయిలు చేష్టలు ఎక్కువ కావడంతో గడిచిన మూడు నెలల్లో ముగ్గురు విద్యార్థినులు ఈ పాఠశాల నుంచి టిసి తీసుకుని ఇతర పాఠశాలకు వెళ్లిపోయారు. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆత్మకూరు పాఠశాలలో ఆకతాయిల చర్యలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

'అనంత సంకల్పం'కు ఆదివారాల్లో మినహాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనంత సంకల్పం కార్యక్రమం ఆదివారాలు, సెలువు రోజుల్లో ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యా శాఖ ఏడి కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట రమణ, పామిడి మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాశాఖ ఎడి కృష్ణయ్యను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

మార్పులు-చేర్పులు..?!

◆ అభ్యర్థుల ఎంపికపై వైసిపిలో ఊహాగానాలు ◆ నేతల్లో గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుండటంతో అప్పుడే రాజకీయ వేడి రగులుతోంది. ప్రధానంగా అధికార వైసిపిలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఈ ప్రభావం అనంతపురం ఉమ్మడి జిల్లాపైనా ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి జిల్లాలో తిరుగులేని విజయాన్ని సాధించింది. 14 అసెంబ్లీ స్థానాల్లో 12, రెండు పార్లమెంట్ స్థానాలను వైసిపినే గెలుచుకుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే మాదిరి ఫలితాలుండాలని ఆ పార్టీ ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పుడున్న ఎమ్మెల్యేల పనితీరు, వారికి ప్రజల్లోనున్న ఆదరణను సర్వేల ద్వారా గుర్తించే పనిని ఇదివరకే గుర్తించింది. ఆరోపణలు, పనితీరు సరిగాలేని వారిని ఇప్పుడు మారుస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మార్పులు ఏయే నియోజకవర్గాల్లో ఉంటాయన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి మార్పు ఇప్పటికే జరిగింది. అంతకముందున్న ఇక్బాల్ స్థానంలో దీపికను తీసుకొచ్చారు. ఈ రకమైన మార్పులు ఇంకెన్ని చోట్ల జరగనున్నాయన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

సగానికిపైగా స్థానాల్లో మార్పు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలుంటే సగానికిపైగా స్థానాల్లో పాత వారిని కాదని, కొత్తవారికి అవకాశం కల్పిస్తారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. అనంతపురం జిల్లాకు సంబంధించినంత వరకు శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో కొత్తవారికి ఈసారి చోటు కల్పించే ఆలోచనలో పార్టీ అధిష్టానమున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి ఈ విషయాన్ని తెలియజేశారని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో కళ్యాణదుర్గంలోనూ మంత్రి ఉషశ్రీచరణ్ స్థానాన్ని మారుస్తున్నట్టు సమాచారం. అదేవిధంగా రాయదుర్గం, గుంతకల్లు స్థానాల్లోనూ మార్పులు జరగవచ్చునని ప్రచారం నడుస్తోంది. ఇక సత్యసాయి జిల్లా హిందూపురంలో ఇప్పటికే మార్పు జరిగింది. ఇక మడకశిర నియోజకవర్గంలో తిప్పేస్వామి మార్పు ఉండనుంది. ఈమేరకు ఆయనకు ఇటువంటి సంకేతాలను ఇచ్చారు. కదిరిలో గత కొంతకాలంగా కొత్తవారి పేర్లు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. మక్బుల్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశాలున్నాయని ప్రచారం నడుస్తోంది. పుట్టపర్తిలో శ్రీధర్‌రెడ్డి కాకుండా ఆయన భార్యకు అవకాశం కల్పించే సూచనలున్నట్టు సమాచారం. ఇక రాప్తాడులోనూ బిసిలకు అవకాశం కల్పిస్తే ఎలాగుంటుందన్న ఆలోచన అధిష్టానం మదిలోనున్నట్టు ఆ పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది.

పార్లమెంటుకు కొత్తవారేనా ?

అనంతపురం, హిందూపురం పార్లమెంటు స్థానాలకు ఎంపిలిద్దరినీ మార్చే సూచనలు కనిపిస్తున్నాయి. అనంతపురానికి తలారి రంగయ్య ఉండగా, హిందూపురానికి గోరంట్ల మాధవ్‌కు ఈసారి అవకాశం లేనట్టు తెలుస్తోంది. ఈ రెండు చోట్ల కొత్త వారికి అవకాశం కల్పించే అవకాశాలున్నాయి. మార్పులు, చేర్పుల్లో కొత్త వారికి ఎవరికి అవకాశాలొస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అనేక మంది కొత్తవారు కూడా టిక్కెట్టు రేసులో నిలుచున్నారు.

6న జెఎన్‌టియు స్నాతకోత్సవం

ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చేనెల 6వతేదీన జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఉపకులపతి రంగజనార్ధన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలుపుతూ రాజ్ భవన్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే స్నాతకోత్సవానికి సంబంధించిన నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కమిటీలకు కేటాయించిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్నాతోకోత్సవం పండుగలా జరగాలని సూచించారు. స్నాతకోత్సవ సందర్భంగా పిహెచ్‌డి పట్టాలు, బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సిఐటియు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ఖాళీ బిందెలతో స్థానికుల నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని సిఐటియు కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు కాలనీవాసులు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 30 ఏళ్లు గడిచినా కనీసం మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా తాగునీటి వసతి లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతోపాటు సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఆఖరికి నివాసం ఉంటున్న ఇళ్లకు మున్సిపల్ అధికారులు ఇంటి పన్నులు కూడా వేయలేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలు, నిరసనలు చేసినా ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిఐటియు కాలనీలో తాగునీరు పైపులైన్లు, సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సభ్యులు మారుతీప్రసాద్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఓబులేసు, ఎస్కేయం బాషా, అబ్దుల్లా, జాకీర్, షబ్బీర్, సూరి, కార్యదర్శులు ఖాదర్‌బాషా, ప్రసాద్, సూరి, రవి, సిఐటియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, సిఐటియు కాలనీవాసులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

జిల్లావ్యాప్తంగా విధులు బహిష్కరించిన వర్కర్లు - కార్యాలయాల ఎదుట నిరసనలు

పుట్లూరులో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు నిరవధిక సమ్మెబాట పట్టారు. ఇందులో భాగంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు అన్నిరకాల విధులు బహిష్కరించి తహశీల్దార్ కార్యాలయాల ఎదుట టెంట్లు వేసి నిరసనలు చేపట్టారు.

అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీలు అన్నిరకాల విధులు బహిష్కరించి సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. 6 నెలల నుంచి పెండింగ్‌లో పెట్టిన సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలన్నారు. సర్వీస్‌లో ఉండి చెల్లిస్తామన్న జగన్ హామీ అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి విన్నవించిన స్పందించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అలాగే పిల్లలకు బాలింతలకు నాణ్యతలేని బాలామృతం, గుడ్లు, చిక్కీలు, సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, నగర నాయకులు విజయభారతి, నక్షత్ర మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. వీరి సమ్మెకు సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు లక్ష్మినరసింహులు, దలవాయి రమాదేవి, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముస్కిన్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆది, ఆజాం, బాషా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రుక్మిణి, పాతక్క తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలం కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వినతులు ఇస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రులు, ఇతర అధికారుల హామీలు నెరవేర్చలేకపోయారన్నారు. అధికారులతో జరిగిన చర్చల్లో చిన్నాచితక సమస్యలు కొన్ని పరిష్కారమైనా ప్రధాన సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. చేసేది లేక అంగన్వాడీలు అనివార్య పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 55,605 అంగన్‌వాడీ సెంటర్లను డిసెంబర్ 12 నుండి నిరవధికంగా మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యంగా కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, ఆఖరి వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ఐసిడిఎస్‌కు అదనపు నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, ప్రీ స్కూలును బలోపేతం చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

గుంతకల్లు రూరల్ : నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాళ్లు గంగమ్మ, రేష్మీ మాట్లాడుతూ అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రూ.26వేల జీతంతోపాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెకు సిపిఎం, టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, మండల కార్యదర్శి సాకే నాగరాజు, సిపిఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యుడు బి.శ్రీనివాసులు, నాయకులు మారుతీప్రసాద్, బి.తిమ్మప్ప, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు చంద్ర, అబ్దుల్లా, జాకీర్, సురేంద్ర, మహేంద్ర, టిడిపి నాయకులు ముక్కన్నగారి రామాంజనేయులు, లక్ష్మి, కేశప్ప, జింకల రామాంజనేయులు, ఆమ్లెట్ మస్తాన్ తదితరులు ఉన్నారు.

గార్లదిన్నె : అంగన్వాడీలకు కనీస వేతనం 26000 పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్యామల, ప్రమీల, రాజేశ్వరి, లీలావతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

శింగనమల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు భాస్కర్, ప్రాజెక్టు మండల అధ్యక్షురాలు రమణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు భారతి, సెక్టార్ లీడర్ రత్తమ్మ, ప్రమీల, నాగేశ్వరి, ఐసిడిఎస్ ప్రాజెక్టు మండల అధ్యక్షురాలు డీఎస్ కెవి.రమణ, అంగన్వాడీలు రామలక్ష్మి, ఓబుళమ్మ, సుగుణ, శ్రీదేవి, చౌడమ్మ, నాగరత్న, రామాంజనమ్మ, నారాయణమ్మ, ప్రశాంతి, రాధిక, కాంతమ్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ సీఎం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శివశంకర్, రామయ్య, మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్లూరు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగన్వాడీ యూనియన్ నాయకులు జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షులు టి.పెద్దయ్య, వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీల న్యాయమైన సమస్యల సాధన కోసమే నిరవధిక సమ్మె చేపట్టినట్లు అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఉరవకొండ ప్రాజెక్టు కార్యదర్శి విజయ, అరుణకాంతమ్మ తెలిపారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిరవధిక సమె చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నారాయుడు, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రిస్వామి, సామాజిక కార్యకర్త బెంజిమెన్, సిఐటియు నాయకులు సుధాకర్, ఎంపీ మల్లికార్జున, విడపనకల్లు మండల లీడర్లు స్వర్ణలత, దుర్గాదేవి, రామాంజనమ్మ, హేమలత, గాయత్రీదేవి, శ్రీలక్ష్మి, లక్ష్మీదేవి, శశికళ, శారద, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ సమ్మె విరమించబోయేది లేదని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాయదుర్గం ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మల్లక్క, చంద్రకళ, రుద్రమ్మ, మెహరున్, రాధిక, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ టీచర్లు నిరసన సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి సత్యవతి, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధ, తిలోత్తమ, మారుతమ్మ, అలివేలమ్మ, ఈశ్వరమ్మ, 62 సెంటర్ల టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

గుత్తి : అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్, ఆయాల యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెలోకి దిగారు. ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని ఆందోళన చేపట్టారు. సమ్మెకు ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.కవిత, ఎన్.రేణుక, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. వీరి దీక్షలకు పలువురు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు అనిమిరెడ్డి, అంగన్వాడీలు, జయంతి, రామాంజనమ్మ, నారాయణమ్మ, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు బాబా ఫక్రుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యుడు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాయదుర్గంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరవధిక సమ్మె చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెలో పాల్గొన్నారు. వీరి సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల ప్రతినిధులు రాధా, హులిగమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె ప్రారంభించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగనవాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షు రాలు పాతక్క, సెక్టార్ లీడర్స్ వన్నూరమ్మ, యశోధ, దేవీ, రాధమ్మ, గోవిందమ్మ, తులసీ, లక్ష్మీ, వెంకటలక్ష్మీ, సుధామణి, మినీ టీచర్స్, మెయిన్ టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు.

అధికారులకు నెమలి అప్పగింత

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని కురగానిపల్లి గ్రామంలో ఓ రైతు పుట్లూరు సోమనాథరెడ్డి పొలంలో ఆనారోగ్యంతో పడి ఉన్న నెమలి కనిపించడంతో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి అప్పగించారు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిన సోమనాథరెడ్డి అపస్మారక స్థితిలో ఉన్న నెమలిని గమనించి నెమలికి వైద్య పరీక్షలు చేయించాడు. నెమలి కోలుకున్న తరువాత ఎస్ఐకి అప్పగించాడు. ఆయన అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

In the court of the IV th Addl. District Judge:Ananthapuramu
O.S.No:52/2023
Between:
Valipi Reddy Konda Reddy Pradeep Kumar ...Plaintiff
And
1.Reddyvari Swapnaram,
2. Ankireddy Nagapratap Reddy
3.K.Sudhakar Reddy ...Defendants
Notice to Defendant No:1
D1: Reddyvari Swapnaram, W/o R. Jayarami reddy, R/o D.No:7/248, Malleswari Road, Ananthapuramu.
పై నెంబరు కేసులో 1వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 22-12-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
R.RAMAKUMAR, K.NAGARAJU,
ADVOCATES, ANANTHAPURAMU.

In the court of the Prl . Junior Civil Judge:Ananthapuramu
O.S.No:387/2021
Between:
G.M.Jaffar Vali Khan ...Plaintiff
And
P.Khathija Kausar @ Halima Jujuba ...Defendant
Notice to Defendant
To:
Smt.Khathija Kausar @ Halima Jujuba
W/o G.M.Jaffar Vali Khan, D/o P.Majeed Khan (Late) R/o D.No:8/123, Guntabavi Street, Guntakal town, Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 14-12-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
M.VISHNUVARDHAN REDDY,
K.CHANDRA SEKHAR RAO
ADVOCATES, ANANTHAPURAMU.

BEFORE THE CHAIRPERSON CUM-PRESIDING OFFICER: INDUSTRIAL TRIBUNAL-CUM-LABOUR COURT: ANANTAPUMMU.
I.D. No.169/2018
Between:
R. Prakash Reddy ...Petitioner
And
1.SITI NETWORKS Limited, (Formerly known as SITI Cable Networks Limited) Rep. by its Chairman, GYS Global, Tower A, 4th Floor, Sector-125-Noida, Uttar Pradesh And Another ...Respondants
Notice to Respondant No:1
R1:
1.SITI NETWORKS Limited, (Formerly known as SITI Cable Networks Limited) Rep.by its Chairman, GYS Global, Tower A, 4th Floor, Sector-125-Noida, Uttar Pradesh.
పై నెంబరు కేసులో 1 వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 18-12-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
Y.RAMALINGA REDDY
ADVOCATE, ANANTHAPURAMU.
Cell:9440095089

రైతులను ఆదుకోవాలి

కరువు బృందానికి ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘాల నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ రూ.10వేల కోట్లు కేటాయించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లాకు వచ్చిన కేంద్ర కరువు బృందానికి రైతుసంఘం నేతలు కందుకూరు వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని వివరించారు. ప్రభుత్వాలు స్పందించి కరువు నివారణకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరారు. అలాగే రైతుల పంట రుణాలు ప్రయివేట్ అప్పులతో సహా ఒకేసారి మాఫీ చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం ఎకరాకు రూ.10 వేలు వరకు ఇవ్వాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై జిఎస్‌టి రద్దు చేసి, దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు వెంకటరెడ్డి, టి.రామాంజినేయులు, మన్నీల సర్పంచి త్రిలోక్‌నాథ్, గంగాధర్, వెంకటనారాయణ, బి.చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య, సూర్యనారాయణ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని వినతి

కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మన్నీల గ్రామంలో కేంద్ర కరువు బృందాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది కౌలు రైతులు కౌలుకు పంటలు సాగు చేసి పెద్ద ఎత్తున నష్టపోయారు. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిల్లాలో 20 వేలకు పైబడి కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం కేవలం 5 వేల మందికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు జారీ చేసిందన్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ముందస్తుగా కౌలు చెల్లించి రైతులు పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టపరిహారం భూ యజమానులకు వస్తుందని, పంటలు వేసి నష్టపోయిన కౌలు రైతులకు మాత్రం నయా పైసా కూడా రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు.

కరువు బృందానికి వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ఆత్మకూరు : కరువుతో తీవ్ర నష్టాలపాలైన జిల్లారైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బృందానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతున్న పంటలు నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే 90 శాతం సబ్సిడీతో రైతులకు పనిముట్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇవ్వాలన్నారు. పంచనామా ఆధారంగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివశంకర్, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య మధ్యాహ్న భోజనం పథకం జిల్లా నాయకురాలు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవక్‌ల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఆల్ ఇండియా గ్రామీణ డక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డక్ సేవక్ సంఘాల పిలుపుమేరకు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండ మండల కేంద్రంలోని పోస్టల్ డిపార్‌మెంట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7వ వేతన కమిటీలో అమలుకాని అంశాలపై ఇప్పటికే మూడంచెల ప్రోగ్రాం పూర్తి చేశామన్నారు. అయితే తపాలాశాఖ ఉన్నతాధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్ప చేసిందేమీ లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఆందోళన బాట చేపట్టినట్లు తెలిపారు.

బెలుగుప్ప : ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపుమేరకు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈమేరకు మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్లానాయక్, జయరాములు, శివానంద, గాయత్రి, శారదమ్మ, శ్వేత, కార్తీక్, ఆనంద్, రఫీ, ముస్కిన్ వలి, వన్నూరుస్వామి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఏడవ వేతన కమిటీలో అమలు చేయని అంశాలను పరిష్కరించాలని నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవాక్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈమేరకు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో తపాల సిబ్బంది నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా సిబ్బంది రియాజ్, పుల్లన్న, పోస్టుమెన్లు, పాల్గొన్నారు.

రాయదుర్గం : తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గ్రామీణ తపాలా సేవకులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక తపాలా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబి రంలో రాయదుర్గం తపాలా సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాలా సేవకులు సమ్మెలో పాల్గొన్నారు. అఖిల భారత గ్రామీణ తపాలా సేవకుల యూనియన్(ఎఐజిడిఎస్‌యు) రాయదుర్గం సబ్ డివిజన్ జనరల్ సెక్రటరీ టి.కృష్ణప్ప మాట్లాడుతూ రాయదుర్గం సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 50 మంది తపాలా సేవకులు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. తపాలా సేవకుల సమ్మె వల్ల సబ్ డివిజన్ పరిధిలో తపాలా శాఖ కార్యకలాపాల అమలుకు అంతరాయం కలిగింది.

తప్పుడు ప్రచారాలు తగదు

రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల

ప్రజాశక్తి-శింగనమల



విలేకరులతో మాట్లాడతున్న రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల

తమ పార్టీ నేతలపై సోషియల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పని రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ సిహెచ్ ప్రమీల హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. మీ స్వలాభం కోసం తమ నేతలపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో ప్రచురించడాన్ని బాధాకరమన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అండర్-16 ఎపిఎల్ టోర్నమెంట్‌లో తాడిపత్రి విజయం

ప్రజాశక్తి-తాడిపత్రి

72 పరుగులు చేసి, నాలుగు వికెట్లు తీసిన అభినయ

అండర్-16 ఎపిఎల్ బాలికల జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కళ్యాణదుర్గం జట్టుపై తాడిపత్రి జట్టు విజయం సాధించింది. తాడిపత్రి జట్టులో అభినయ ఆల్‌రౌండర్‌గా రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. తొలుత టాస్ గెలిచిన తాడిపత్రి జట్టు బ్యాటింగ్ తీసుకుని నిర్ణీత 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కళ్యాణదుర్గంజట్టు 9 వికెట్లు కోల్పోయి 154 పరుగులు సాధించింది. దీంతో 52 పరుగుల తేడాతో తాడిపత్రి జట్టును విజయం సాధించింది. తాడిపత్రి జట్టులో అభినయ 72 పరుగులు, నాలుగు వికెట్లు, శ్వేతశ్రీ 27 పరుగులతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. కళ్యాణదుర్గం జట్టులో బౌలర్ ప్రణీత 3 వికెట్లు తీయగా, తనుశ్రీ 47 పరుగులు సాధించింది. ఈమేరకు విజయం సాధించిన తాడిపత్రి జట్టును ఎటిఎల్ రామాంజనేయులు, శ్రీవాణి హై స్కూల్ ఛైర్మన్ ఎం.గంగాధర్, పీఈటీ అబ్రహం, శ్రీసాయి చైతన్య కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ, సీనియర్ కోచ్ సాదిక్ వలి, ఆర్‌డిటి క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందించారు.

ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపి

జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

మల్లేష్‌ను పరామర్శిస్తున్న టిసి.వరుణ్

అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులను మోసం చేశారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోవడంతో మనస్థాపం చెందిన ఉపాధ్యాయులు బోయ మల్లేష్ ఆత్మహత్యాయతానికి పాల్పడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న టిసి వరుణ్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆత్మహత్యాయత్నానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదంగా బతుకుతున్న ఉపాధ్యాయులను ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి సీఎం జగన్ తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి మేల్కొని ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా విశాఖపట్నంలో జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, అంకే ఈశ్వరయ్య, కుమ్మర నాగేంద్ర, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, జక్కిరెడ్డి ఆదినారాయణ, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, అంజి, సంపత్ అశోక్, పెండ్లిమర్రి శీనా, హరి, విజయ్‌దేవ రాయల్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ఎపి రైతుసంఘం నాయకులు

పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

తాడిపత్రి రూరల్ : కర్నూలులో ఈనెల 15, 16, 17వతేదీల్లో నిర్వహించనున్న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఎపి రైతుసంఘం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల రైతు ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకు వనరులు కల్పించే స్థితిలో రాజకీయ పార్టీలు లేవన్నారు. ప్రాజెక్టుల కోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుత సంక్షోభం నుంచి రైతులను ఎలా బయటకు తీసుకురావాలన్న అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు జయశంకర్‌రెడ్డి, శిరీషా, మల్లిక పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుత్తి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఈవో ఎ.శ్రీరాములు, ప్రిన్సిపల్ సి.వెంకటేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. పిఆర్ఆర్ ఎంబిఏ కళాశాల చెందిన విద్యార్థి జె.జయ సాయిసుభాష్ ఎస్.కె యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రన్నింగ్ 800 మీటర్లు, 400 మీటర్లు, త్రో డిస్క్ లో మూడు బంగారు పతకాలను సాధించాడు. దీంతో స్థానిక కళాశాల ఆవరణలో పిఆర్ఆర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసన్నకుమార్ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఈటి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మలాకుమారి, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రాయదుర్గం : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయుఎ) పిలుపుమేరకు సభ్యులు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అసోసియేషన్ రాయదుర్గం యూనిట్- 1 కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర నాయకత్వం రెండు రోజుల ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై డిపో గేటు వద్ద ధర్నా చేపట్టామన్నారు. ధర్నాలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగరాజు, జోనల్ జాయింట్ సెక్రటరీ ఎం.నాగరాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు హెచ్‌సి.తిప్పేస్వామి, టిఎస్‌జె జిలాన్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు దూద్‌పీరా, సతీష్‌కుమార్ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రయివేటుకు దీటుగా ప్రయాణికులకు సేవలు, పిఎఫ్, బాకాయిలు, అలవెన్సులు, తదితర 59 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ జగదీష్, అదనపు కార్యదర్శులు రమేష్, నాయకులు, 60 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మట్టి రోడ్డు నిర్మాణం

జెసిబితో మట్టిని చదును చేస్తున్న దృశ్యం

అనంతపురం : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో అనంతపురం నియోజకవర్గ రుద్రంపేట పంచాయతీ పరిధిలో ఆలమూరు వెళ్లే ప్రధాన దారిలో పెద్ద పెద్ద గుంతలను పూడ్చారు. ఈ దారిలో పెద్దపెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. దీంతో ఎమ్మెల్యేకు విన్నవించడంతో ఆయన చొరవతో సుమారు 400 మీటర్లు మట్టి రోడ్డు నిర్మించారు.

టిడిపి కార్యాలయంలో సంబరాలు

కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

రాయదుర్గం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 3వేల కి.మీ. పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కౌన్సిలర్ ప్రశాంతి, ముదిగల్లు జ్యోతి, పురుషోత్తం, బండి భారతి, మహబూబ్ బాషా, ఉమ, జమీల్‌ఖాన్, ఇనాయ త్, మల్లి, తిప్పేస్వామి, వై.వెంకటేశులు, వేణు, ధనార్జున, రమేష్, అంజి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషపై అవగాహన

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ద్వితీయ భాషగా ఉర్దూ చదువుతున్న విద్యార్థులకు ఉర్దూ భాషపై అవగాహన కల్పించారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉర్దూ అధ్యాపకులు యాసిన్‌పీరా ప్రథమ, తృతీయ సెమిస్టర్ల విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించి అవగాహన కల్పించారు. 2017-18 నుంచి క్రమం తప్పకుండా ప్రతి సెమిస్టర్‌కు ఈ కళాశాలకు వచ్చి ఉర్దూ అధ్యయన విద్యార్థులకు బోధించడం సంతృప్తినిచ్చిందని పీరా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.రఘురామ్మూర్తి , అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

గుమ్మఘట్ట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని మారంపల్లి గ్రామంలో ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవనజ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి, ఫసల్ బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందేష్, సచివాలయ, ఆరోగ్య రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్త

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని నవ రూప అభయాంజనేయ స్వామి, శ్రీశైల మల్లికార్జున భ్రమరాంబికా దేవి ఆలయాల్లో కార్తీక అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా ఆలయాల అర్చకులు పంచామృతాభిషేకం, ఆకుపూజ తదితర పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్ గుప్త దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలాదారులు ఆంజనేయస్వామిని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర స్వామి, ధర్మకర్త హనుమంత రాముడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

అనంతపురం : యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 350 మంది అన్ని కేటగిరిల యోగా విద్యార్థులు పాల్గొన్నారు. మాస్టర్ కేటగిరీలో ట్రెడిషనల్ యోగాలో ప్రభావతి తృతీయ స్థానంలో గెలుపొందారు. సబ్ జూనియర్స్ విభాగంలో కీర్తినందన ట్రెడిషనల్ సోలోలో తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరు ఇద్దరు జలంధర్‌లో జరిగే యోగా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నుంచి రాజశేఖర్‌రెడ్డి, దివాకర్, సెక్రటరీ సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని 62వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. ఇందులో భాగంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి బోర్డులతోపాటు వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టిడిపి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని తెలిసి అందరూ బయటకు వచ్చి కల్లిబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల రుణాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మహిళలను నిండా ముంచారని గుర్తు చేశారు. వీటితోపాటు అనేక హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌ను తిరిగి సిఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైసీపీ క్లస్టర్ కన్వీనర్ మధుసూదన్‌గౌడ్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు ఇసాక్, శ్రీనివాసులు, రాజేశ్వరి, సచివాలయ కన్వీనర్లు ధను బాబు, కిషోర్ బాబు, అనిల్, నస్రీన్, పద్మావతి, నాయకులు నడిపంక నాగరాజు, పుల్లయ్య, రామచంద్ర, షరీఫ్, దాదు, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు

అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

రాయదుర్గంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబు, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు చెప్పే మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని శాంతినగర్ 18వ వార్డు సచివాలయం వద్ద మంగళవారం 31, 32 వార్డు కౌన్సిలర్లు తాడూరు భాగ్య, కొంతం దేవరాజు ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి వైసిపి జెండాను ఎగరవేశారు. అనంతరం కాపు మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్ల సిఎంగా ఉండి, కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉండి రాయదుర్గానికి చేసిందేమీ లేదన్నారు. పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, పురపాలక సంఘ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కౌన్సిలర్లు శారద, లావణ్య, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, చెన్న వీరస్వామి, అజయ్‌కుమార్, మంజునాథ, షబ్బీర్, గోవింద, కో ఆప్షన్ సభ్యులు బ్యూలా, నాయకులు కృష్ణమూర్తి, శివ, రవి, దివాకర్, నిజాముద్దీన్, శ్రీరామ్‌రెడ్డి, సత్యనారాయణ, రాము పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను తరిమికొడదాం

ప్రజాశక్తి-ఉరవకొండ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరి భాగస్వామ్యంతో తరిమి కొడదామని పాల్తూరు ప్రభుత్వ వైద్యాధికారి ఎస్.శివశంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్తూరు పిహెచ్‌సి ప్రాంగణంలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ జ్వర పీడిత కేసులకు రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి 303 మందికి రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బ్యూలా రాణి రాజశేఖర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, వైద్య సిబ్బంది నాగమ్మ, సుధాకర్, యశోద, వాసు, మధు, ఈశ్వర్‌నాయక్, శ్రావణి, కళావతి, అనిత, సీతమ్మ, రామలింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూరుబీ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సిసి రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ రఘు,ఎఇ సాయినాథ్‌బాబు, కౌన్సిలర్ షేక్ నజీర్ అహ్మద్, వైసిపి నాయకులు బేడల వెంకటరాముడు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలతోపాటు పప్పూరు ప్రాథమిక వైద్యశాలలో సోమవారం మండల పరిధిలోని కూరగాయలపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవ వృద్ధాశ్రమ నిర్వాహకులు స్రవంతి చంద్రశేఖర్‌రెడ్డి గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి

బుక్కరాయసముద్రం : కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం పిఎంఒ నాగన్న సూచించారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్వాతిలక్ష్మి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 27 నుంచి జనవరి 12వ తేదీ వరకూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అనుమానిత కుష్టు వ్యాధి కేసులను గుర్తించాలన్నారు. అలాంటి వారిని వెంటనే గుర్తించి జిల్లాకేంద్రంలోని ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఒ సత్యనారాయణ, సిహెచ్ఓ మోహన్‌రావు, పిహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న డాక్టర్ సందేష్